క్లుప్తంగా

అవిలమల్లుకు మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలి

మద్దిరాల : తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కుక్కడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్‌కు ఇవ్వాలని కాంగ్రెస్ నియోజకవర్గ యూత్ నాయకుడు పాక మధు యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవిలమల్లు గత 35 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎనలేని సేవ చేశారని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తుంగతుర్తి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పనిచేశారని, ఇప్పుడు మద్దిరాల మండల అధ్యక్షుడిగా, కుక్కడం గ్రామ ఎంపీటీసీగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హసానబాధ పూర్ణచారి, ముక్కాల నాగరాజు, మల్లం సతీష్, గొండ్యాల రమేష్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని చెప్పారు. అనంతరం ఆత్మకూర్(ఎస్) మండలంలో జరుగుతున్న సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న బూర వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తొలి తరం కమ్యూనిస్టు నాయకుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జయంతి, వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా నిర్వహించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ కార్యవర్గ సభ్యులు దంతాల రాంబాబు, బొమ్మగాని శ్రీనివాస్, దొరపెల్లి శంకర్, చామల అశోక్ కుమార్, ఖమ్మంపాటి రాము, నిమ్మల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

తిరుప్పావై పారాయణం



దేవాలయంలో కోలాటం వేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం తిరుప్పావై పారాయణం నిర్వహించారు. విశేష పూజలు, నిత్యపూజాధికాలు జరిపారు. గోదాదేవికి మంగళహారతులిచ్చి కుంకుమార్చనలు చేశారు. కోలాటం, భజనల కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాసరెడ్డి, అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, చక్రవర్తి, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల మెరుగుకు కృషి

కోదాడ : పట్టణంలో మౌలిక వసతుల మెరుగుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణ పరిధిలోని 6, 19 వార్డుల్లో రూ. 10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాభివృద్ధే లక్ష్యంగా రానున్న రోజుల్లో ప్రత్యేక ప్రణాళికను తయారు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్, కౌన్సిలర్లు కందుల కోటేశ్వరరావు, కోల్ల ప్రసన్న లక్ష్మి, నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, కోల్ల కోటిరెడ్డి, శీరంశెట్టి వెంకటేశ్వర్లు, చిత్తలూరి శివయ్య, వాచేపల్లి వెంకటేశ్వరరెడ్డి, సామినేని ప్రమీల, డీసీ వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



6వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

సంస్కృతికి ప్రతీక ముగ్గులు



దురాజ్‌పల్లి : విజేతలకు బహుమతులు అందిస్తున్న మల్లు లక్ష్మి



అర్వపల్లి : తిమ్మాపురంలో చీరలతో మహిళలు

దురాజ్‌పల్లి : ముగ్గులు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. శనివారం సీపీఎం ఐద్వా ఆధ్వర్యంలో కుమ్మరి బజార్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయం ఎదుట రెడ్డిపల్లి వీరన్న జ్ఞాపకార్థం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి, నాయకులు వేల్పుల వెంకన్న, చినపంగి నర్సయ్య, ములకలపల్లి రాములు, సోమపంగు అరుణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

భానుపురి : మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తులో ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్, సింగర్ కొండ రవీందర్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర ఆలయం వద్ద వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ రాచర్ల కమలాకర్, పబ్బతి వేణుమాధవ్, తొణుకునూరి సంతోష్, కలకోట్ల లక్ష్మయ్య, మిట్టపల్లి రమేష్, గుండా శేఖర్, మిరియాల వెంకటేశ్వర్లు, బుద్ధ శ్రీనివాస్ గుప్తా, సౌమ్య, తల్లాడ కృష్ణమూర్తి, ఓరుగంటి రామ్మూర్తి, కర్నాటి కృష్ణ, మహంకాళి సోమయ్య, చింత వెంకన్న పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

అర్వపల్లి : సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ కోరారు. సంక్రాంతి సందర్భంగా తిమ్మాపురం గ్రామంలో బీఆర్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వందమంది మహిళలకు చీరలు, ఇతర బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మారిపెద్ది భవానీశ్రీనివాస్‌గౌడ్, చల్లా రోజారాణి, వల్లపునేని అనిత, నిమ్మల విజయ, కర్నాని కొండలమ్మ, కందుల రాంబాయమ్మ, పాలెల్లి నాగమ్మ, టి.హైమావతి, ఎం.మమత, ఎస్.గంగమ్మ, కె.ఉమ, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కందుల దశరథరామారావు, నిమ్మల లింగయ్య, సదానందం, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ

అర్వపల్లి : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మండల పరిధిలోని కాసర్లపహాడ్‌లో శనివారం హిందూ ధర్మసేన ఆధ్వర్యంలో భక్తులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. అంతకుముందు స్థానిక దేవాలయంలో పూజలు జరిపి కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. పండుగ వాతావరణంలో బ్యాండు మేళాల చప్పుళ్లతో అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని జరిపారు. ఈ నెల 22న ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో దీపాలు వెలిగించి పూజలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు నల్లు దుశ్యంత్‌రెడ్డి, భక్తులు యాదగిరి, మచ్చ నర్సయ్య, విక్రం, వెంకన్న, సైదులు, దిర్శనపు కృష్ణమూర్తి, వి.భిక్షం, మంచాల రామ్మూర్తి, వేముల సత్తయ్య, శ్రీనివాస్, శరత్, భజన బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు, గ్రామస్తులు

గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలి

అర్వపల్లి : గ్రంథాలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని జాజిరెడ్డిగూడెం గ్రంథాలయ లైబ్రేరియన్ దార శ్రీనివాస్ కోరారు. జాజిరెడ్డిగూడెం గ్రంథాలయానికి దాత, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్‌రావు దేశ్‌పాండే కంప్యూటర్‌ను బహూకరించగా దానిని శనివారం గ్రంథాలయ గౌరవ అధ్యక్షుడు కర్నాటి రంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు, పాఠకులు ఈ కంప్యూటర్‌ను వినియోగించుకోవాలని కోరారు. అలాగే గ్రామ పంచాయతీ 12వ వార్డు సభ్యుడు కమటం రాజు కంప్యూటర్ టేబుల్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో బింగి కృష్ణమూర్తి, నర్సింగ వెంకటేశ్వర్లు, మేకల సత్యనారాయణ, కమటం రాజు, కుంభం మదన్‌మోహన్, రెంటాల కరుణకుమార్, పీటీడబ్ల్యూ కుంభం సోమయ్య, నవీన్, పాఠకులు పాల్గొన్నారు.



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న కర్నాటి రంగయ్య

వైభవంగా గోదాదేవి కల్యాణం



చివ్వెంల : కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీమాన్ అరుట్ల రవికుమారచార్యులు, క్రిష్ణమాచార్యులు అమ్మవారికి వేదమంత్రోచ్ఛరణతో పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బంధకవి క్రిష్ణమోహన్, మధుసూదనరావు పాల్గొన్నారు.

నేడు గోదా శ్రీనివాస కల్యాణం

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గత నెల రోజులుగా జరుగుతున్న ధనుర్మాస మహోత్సవాలు ఆదివారం గోదా శ్రీనివాస కల్యాణంతో ముగియనున్నాయి. దేవాలయ పశ్చిమ భాగంలో ఉన్న మైదానంలో శ్రీ గోదా శ్రీనివాస కల్యాణం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సుమారు వెయ్యి మంది దంపతులు కూర్చొని కల్యాణం జరిపే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు. కల్యాణానంతరం శ్రీ ఇమ్మడి సోమనరసయ్య దంపతులు, సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిర్వహించే అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగే గోదాదేవి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో అలంకరించి టెంట్లు వేశారు. అలాగే కొమ్మాలలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కూడా గోదాదేవి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకుడు దరూరి జగన్నాథచార్యులు తెలిపారు.



భానుపురి : ముస్తాబైన మండపం



జాజిరెడ్డిగూడెంలో ముస్తాబైన దేవాలయం

మృతుడి కుటుంబానికి పరామర్శ

చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రౌతు రాఘవరావు (82) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించారు. మృతుడి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, మాజీ సర్పంచ్ జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



పెన్‌పహాడ్ : క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కొండమీది గోవిందరావు



నాగారం : ఈటూరులో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న భిక్షం

పెన్‌పహాడ్ : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండమీది గోవిందరావు అన్నారు. శనివారం చెట్లముకుందాపురం గ్రామంలో నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ, ముగ్గులు, డ్యాన్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసా రాములు, మోదాల గోపి, రాయిరాల చిన్ని, మిర్యాల కృష్ణమూర్తి, యూత్ అధ్యక్షుడు అంజనపల్లి సుధాకర్, అనంతుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని మొండిచింత తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ లావూడియా మోహన్‌బాబు కోరారు. శనివారం గ్రామంలో నవ యుగ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో బాలాజీ, మహేష్, వెంకన్న, రామ్‌జీ, గోపి, నజీర్‌బాబు, రమేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

నాగారం : సంక్రాంతి సందర్భంగా ఈటూరులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి క్రీడల్లో పాల్గొంటున్న వారికి గ్రామానికి చెందిన గంగి భిక్షం శనివారం ఉచితంగా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని అన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సభ్యులు యల బాబు, బొట్టు సురేష్, వంగూరి సందీప్, బుడిద గణేష్, గట్టగళ్ల సుధాకర్, గోపి, అనిల్, ఉదయ్‌కిరణ్, మహేష్, శ్రీను, వెంకన్న, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలను విజయవంతం చేయాలి

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్లలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే సంక్రాంతి క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ, పీవైఎల్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ శ్రీధర్‌నాయక్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామ శివారులోని పాలేరు వాగు నుంచి గ్రామానికి చెందిన కప్పల రామ్మూర్తి, కారింగుల మల్లయ్యలు అక్రమంగా నిల్వ చేసిన 80ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తామని అన్నారు. ఈ నెల 18న బహిరంగ వేలం ద్వారా ఇసుక విక్రయం చేపట్టనున్నట్లు తెలిపారు.

పేటలో ఘనంగా భోగి వేడుకలు



భోగి వేడుకల్లో పాల్గొన్న సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

భానుపురి : పట్టణంలోని తాళ్లగడ్డలో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన భోగి వేడుకలను ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు మనమంతా ఇచ్చే గౌరవం సంక్రాంతి పండగ అన్నారు. ప్రజల కష్టనష్టాలు భోగిమంటల్లో కలిసిపోవాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కక్కిరేణి శ్రీనివాస్ గౌడ్, కొప్పుల వేణారెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

తుంగతుర్తి : సమాజంలో ఆర్య వైశ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం మండల కేంద్రంలో బహుమతులను ప్రదానం చేశారు. ఆర్యవైశ్యులు పేద ప్రజలకు సేవలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ముగ్గుల పోటీలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెబుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఓరుగంటి సత్యనారాయణ, పాలవరపు సంతోష్, ఓరుగంటి శ్రీనివాస్, ఈగ లక్ష్మయ్య, ఈగ నాగన్న, వెంకన్న తల్లాడ సూర్యకళ, తల్లాడ కేదారి, బండారు దయాకర్, శ్రీను, ఓరుగంటి సుభాష్, వీరన్న, అనూక్, రేతినేని శ్రీనివాస్, కృష్ణమూర్తి, గంగరాజు, రాంబాబు, నరేష్, రాములు, యాకయ్య, భాస్కర్, సుభాషి, కృష్ణవేణి, మహిళలు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

భక్తిభావం పెంపొందించుకోవాలి

నూతనకల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. శనివారం వెంకెపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ, నాగం సుధాకర్‌రెడ్డి, సైరెడ్డి సుధీర్‌రెడ్డి, సైదులుగౌడ్, పన్నాల మల్లారెడ్డి, తీగల మల్లారెడ్డి, సాబాది వాసు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : వెంకెపల్లిలో పూజలు..

ఊరూరా ఆధ్యాత్మిక శోభ

- కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు
- మరో వైపు పల్లెపల్లెనా మాలధారులు
- భక్తి పరవశంలో గ్రామాల ప్రజలు

అర్వపల్లి : ఆధ్యాత్మిక శోభతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఓవైపు ధనుర్మాస ఉత్సవాలు.. మరోవైపు వివిధ రకాల మాలలు ధరించిన స్వాములతో గ్రామాలు భక్తి పరవశంలో మునిగిపోతున్నాయి. ప్రధానంగా అయ్యప్ప, హనుమాన్, భవాణి, శివ, గోవింద మాలలు ధరించిన స్వాములు పూజలు నిర్వహించడం, ఆలయాలు సందర్శించడం, అన్నదానాలు చేస్తుండటంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ప్రతిఏటా కార్తీకమాసం నుంచి మాలధారణ కార్యక్రమాలు మొదలవుతుంటాయి. సంక్రాంతితో మాల విరమణ పూర్తవుతుంది.

జాజిరెడ్డిగూడెం మండలంలో 500 మందికి పైగానే మాలధారులు..

జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, కొమ్మాల, కోడూరు, అడివెంల, తిమ్మాపురం, కుంచమర్తి, రామన్నగూడెం, పర్సాయపల్లి, బొల్లంపల్లి తదితర గ్రామాల్లో మాలధారులు ఎక్కువగా ఉన్నారు. అయితే కొన్ని గ్రామాల్లో స్వాములు టీంగా ఏర్పడి సన్నిధానాలను ఏర్పాటు చేసుకొని ఒకే చోట పూజలు చేస్తూ అక్కడే కలిసి వంటలు చేసుకొని భిక్ష చేస్తున్నారు. ప్రతిరోజు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు గంటల పాటు స్వాములు పూజలు చేస్తున్నారు. పూజల అనంతరం ఆయా గ్రామాల్లోని ఆలయాలను సందర్శిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. అలాగే జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, కొమ్మాలలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేస్తున్నారు. జాజిరెడ్డిగూడెంలో మహిళలు భవాని మాలలు ధరించి భజనలు, కోలాటాలు నిర్వహిస్తున్నారు.



అర్వపల్లిలో మాలలు ధరించిన స్వాములు

16 ఏళ్లుగా మాలధారణ



“16 ఏళ్లుగా కార్తీకమాసం నుంచి సంక్రాంతి వరకు 41 రోజలు అయ్యప్ప మాలధారణ చేస్తున్నా. ఈ మాలధారణతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాం. ప్రతి ఒక్కరూ మాలధారణచేస్తే ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది.

– జేరుపోతుల లక్ష్మణ్, బొల్లంపల్లి

భక్తి శ్రద్ధలతో పూజలు



“గత రెండేళ్లుగా హనుమాన్ మాల వేసుకుంటున్నా. ఈ మాల వేసినప్పటి నుంచి ప్రశాంతంగా, ఉల్లాసంగా ఉంటుంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్వాములతో కలిసి భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకుంటున్నా. 41 రోజులు దీక్ష కాగానే కొండగట్టుకు వెళ్లి ఇరుముడి సమర్పించుకొని వస్తా.

– కసుకు భద్రి, అర్వపల్లి

పిండి వంటలతో ఉపాధి



తిరుమలగిరిలో సంక్రాంతి పండుగకు పిండి వంటలు చేస్తున్న మహిళలు

పిండి వంటలకు డిమాండ్



“పిండి వంటల తయారీ కేంద్రంతో ఉపాధి పొందుతున్నాం. ఆర్డర్ల సంఖ్య పెరుగుతోంది. చాలా మంది మహిళలు ఇళ్లలోనే వంటకాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. పిండి వంటలకు డిమాండ్ ఉంది.

- పందిరి వనజ, తిరుమలగిరి

తిరుమలగిరి : పండుగ వస్తుందంటే ప్రతి ఇంట్లో పిండి వంటకాలు చేస్తుంటారు. ఏ గ్రామంలో చూసినా పిండి వంటల తయారీలో నిమగ్నమవుతుంటారు. అయితే ఈ సారి చాలామంది తయారీదారులకు ఆర్డర్లు ఇచ్చి పిండి వంటలు చేయిస్తున్నారు. సకినాలు, గారెలు, జంతికలు, నువ్వుల ఉండలు వంటి పిండి వంటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో పిండి వంటల తయారీ కేంద్రాలకు ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం మున్సిపాలిటీలు, పట్టణాల్లో ఈ పిండి వంటలు తయారు చేసేవారు ఎక్కువయ్యారు. ప్రతి ఏటా పిండి వంటల కేంద్రాలకు ఆదరణ పెరుగుతోందని నిర్వాహకులు చెబుతున్నారు.

మకర తోరణాల బహూకరణ



పూజలు చేస్తున్న అర్చకులు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి దాతలు రామరాజు శ్యాంసుందర్, రవిచందర్‌లు శనివారం మకర తోరణాలను బహూకరించారు. అలాగే ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నుగూరు వెంకటరంగాచారి, శ్రీనివాసాచారి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వాలు నమోదు

చిలుకూరు : మండల కేంద్రంలో శనివారం సీపీఐ నాయకులు ఆ పార్టీ సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. 350 మందికి పార్టీ సభ్యత్వాలు అందజేశారు. కార్యక్రమంలో కొండా కోటయ్య, చిలువేరు ఆంజనేయులు, బాలేబోయిన రవి, కస్తూరి సత్యం, మండవ వెంకటేశ్వర్లు, వెంకటి పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

కోదాడరూరల్ : అర్హత కలిగిన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సాయాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు నమోదు కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో ఫామ్ 18ని నింపి అక్కడే ఇవ్వొచ్చని, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు కూడా తిరిగి కొత్తగా ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని, పట్టభద్రులకు ఏ మండలంలో సాధారణ ఓటు ఉంటుందో అక్కడ మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తులకు ఫిబ్రవరి 6 వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన గీత కార్మికుడు మంగ రవి ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి రేఖ చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్ రేఖ తరఫున శనివారం క్వింటా బియ్యం, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్, గ్రామ మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.